క్లుప్తంగా

ఘనంగా ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవం



గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపులో మహిళలు

నాతవరం: మండల కేంద్రంలో శ్రీగౌరీపరమేశ్వరుల ఉత్సవ ముగింపు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయం మేరకు గత నెల రోజులుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముగింపు వేడుకల్లో భాగంగా మహిళలు తమ ఇళ్ల వద్ద తయారు చేసిన వంటకాలతో సారె పెట్టారు. వాహనంపై గౌరీ పరమేశ్వరులను పురవీధుల్ల ఊరేగించారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఎం.బి.పట్నంలో కూడా గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించి, మహిళలు సారెతో సాగనంపారు.

కో జనరేషన్ ప్లాంట్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

బుచ్చెయ్యపేట: గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో కో జనరేషన్ ప్లాంటు మరమ్మతులకు గురై నాలుగు రోజులైనా గోప్యంగా ఉంచడంపై రైతు సంఘ నాయకులు జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి ఫిర్యాదు చేశారు. బుధవారం వడ్డాది చెరకు కాటా వద్ద రైతు సంఘ నాయకులు శిరిగిశెట్టి చిన వెంకయ్యదొర, రావాడ సన్యాశినాయుడు తదితరులు రైతులతో సంతకాలు చేయించి, ఫ్యాక్టరీ నష్టాల బాట పట్టకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సక్రమంగా క్రషింగ్ చేయకపోవడం వల్లే కో జనరేషన్ ప్లాంటు ఆగిపోయిందని, దీంతో సుమారు రూ.95 లక్షల వరకు ఫ్యాక్టరీకి నష్టం వచ్చిందని ఆరోపించారు. తక్షణమే మరమ్మతుకు చర్యలు చేపట్టాలని కోరారు.

క్రీడల్లో యువత రాణించాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ గిరిబాబు

గొలుగొండ: యువకులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు తెలిపారు. పాకలపాడు గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. మండలం నలుమూలల నుంచి సుమారు 20 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, స్థానిక నాయకులు రాజాన అప్పల నాయుడు, యర్రాల్ల నాయుడు, శింగపల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

రావికమతం : మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకన్నబాబు బుధవారం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులతోపాటు, సర్పంచ్‌లు, మండల ప్రజా ప్రతినిధులు పాల్గొనే ఈ సమావేశానికి అన్ని శాఖల మండల అధికార్లు సంబంధిత నివేదికలతో హాజరు కావాలని ఆయన తెలిపారు.

ఘనంగా ఎంపీపీ జన్మదిన వేడుకలు



రామధర్మజ పుట్టిన రోజు వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకులు

మాడుగుల : ఎంపీపీ వేమవరపు రామధర్మజ పుట్టిన రోజు వేడుకలు స్థానిక ఎంపీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎడ్ల కళావతి, వైస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనువాసరావు, పార్టీ నాయకులు ఎడ్ల హేమంత్ కుమార్, ఇందుకూరి నాగరాజు, సయ్యపురెడ్డి సత్తిబాబు, కొసిరెడ్డి క్రిష్ణమూర్తి, కుక్కర శ్రీధర్, వేమణ గణేష్, ఎం.అశోక్, శీలామంతుల వాసు తదితరులు రామధర్మజకు స్వీట్స్ అందించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు.

పథకాలకు అర్హతే ప్రామాణికం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

మాకవరపాలెం: సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హతే ప్రామాణికమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మండలంలోని రాచపల్లిలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు పెట్ల సత్యవేణి, నేతలు భద్రాచలం, దొరబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ఇంటింటికీ ఎమ్మెల్యే గణేష్ వెళ్లారు. ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించడంతోపాటు మూడేళ్ల కాలంలో ఎవరెవరికి ఎంతమేర లబ్ధి కలిగిందనే విషయాన్ని కూడా ప్రజలకు తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమ పరమావధిగా ముందుకు సాగుతున్న సీఎం జగన్‌కు ప్రజలు వెన్నంటి ఉండాలని కోరారు. దళితవాడలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాజారావు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీడీవో అరుణశ్రీ, తహసీల్దార్ ప్రసాదరావు, పార్టీ నాయకులు చిటికెల రమణ, గొంతిన హరిబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉగాదికి ఆలయాల నిర్మాణం పూర్తి

మాకవరపాలెం: ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన దేవాలయాల నిర్మాణాన్ని ఉగాది నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని దేవదాయశాఖ డీఈ సైదా తెలిపారు. రాచపల్లి పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేను పెట్ల ఉమాశంకర గణేష్ బుధవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 22 ఆలయాలను మంజూరు చేశామని, కమిటీ సభ్యులు వెంటనే బ్యాంకు ఖాతాలు తెరవాలని సూచించారు. ప్రభుత్వం నిర్మాణానికి అవసరమైన నిధులను ఆయా ఖతాల్లో జమ చేస్తుందన్నారు. నిర్మాణాలు వేగవంతం చేసేలా చూడాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది నగేష్, శ్రీధర్ ఉన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

● గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా చోడవరం సచివాలయం–3 పరిధిలోని వ్యాపారవీధి, లక్ష్మీథియేటర్, రామాలయం వీధి ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ కారణాలతో పింఛన్లు రానివారు, తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా త్వరలో వారికి పింఛన్లు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి తాము పొందుతున్న పథకాలు, ఆర్థిక భరోసాపై మహిళలు, స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఓటీఎస్ పథకంలో ఇంటి హక్కు రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రభుత్వ విప్ ధర్మశ్రీ అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, తహసీల్దార్ తిరుమలరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, ఈఓపీఆర్డీ చైతన్య, పంచాయతీరాజ్ డీఈఈ ప్రసాద్, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్ద గంగరాజు, పంచాయతీ ఈవో నారాయణరావు, సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, ఎంపీటీసీ పొట్నూరి అరుణ, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బీమా సాయం అందిస్తున్న ఎంపీపీ జయమ్మ, ఎంపీడీవో జయప్రకాష్

చీడికాడ: మండలంలోని దిబ్బపాలేనికి చెందిన శ్రీనాథ్ సత్తిబాబు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందడంతో అంతిమ సంస్కారాలకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందించినట్లు ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. రూ.10 వేలును ఎంపీడీవో జయప్రకాష్‌తో కలిసి మృతుడి భార్యతకు అందించినట్టు పేర్కొన్నారు. మిగిలిన బీమా నగదు నెల రోజుల్లో నామినీ ఖాతాలో జమ చేయనున్నట్టు తెలిపారు. మృతుని కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణ, మాజీ సర్పంచ్ వైఎస్సార్ సీపీ నేత నందారపు రమణబాబు ఉన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది మానవహారం

దేవరాపల్లి : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వైఎస్సార్ క్రాంతి పథం(వెలుగు) ఏరియా కో ఆర్డినేటర్ ఏఎం రాజేశ్వరి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రం దేవరాపల్లిలో ఏపీఎం ఎస్.ప్రభాకర్ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై బుధవారం అవగాహన ర్యాలీ జరిగింది. మండల మహిళా సమాఖ్య కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించి, నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీసీలు గౌరీ శంకర్, సత్యనారాయణ, పైడిబాబు, సరోజిని, ఉమమహేశ్వరరావు, అకౌంటెంట్ దేవి పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

నాతవరం: బాల్య వివాహాలను నివారించడంతో పాటు, మహిళల్లో రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బందితో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా తీసుకుంటే చాలా వరకు రక్తహీనతను అధిగమించవచ్చన్నారు. చిన్నారులకు కౌమార దశలో వచ్చే మార్పులపై అవగాహన కల్పించి, చెడు వ్యాసనాలపై దృష్టి సారించకుండా చైతన్యం తీసుకురావాలన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అందరూ పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పంచాయతీ విస్తరణాధికారి ప్రేమలీల పాల్గొన్నారు.

నాటుసారా నియంత్రణకు చర్యలు



కందిపూడిలో బెల్లం రైతులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

బుచ్చెయ్యపేట : నాటు సారా నియంత్రణకు బెల్లం తయారీ రైతులు సహకరించాలని చోడవరం ఎక్సైజ్ ఎస్ఐ ఎస్ చంద్రశేఖర్ కోరారు. బుధవారం బుచ్చెయ్యపేట మండలం చిన కందిపూడి, పెద కందిపూడి, మల్లాం, రాజాం తదితర గ్రామాల్లో బెల్లం క్రషింగ్ రైతులకు నాటుసారా నియంత్రణపై అవగాహన కల్పించారు. నాటు సారా వల్ల కలిగే అనర్థాలను వివరించి, నల్లబెల్లం తయారు చేయకుండా అధికారులకు సహకరించాలన్నారు. ఎక్కడైనా నాటు సారా తయారు చేస్తే సమాచారం అందించాలని ఆయా గ్రామాల రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. వడ్డాదిలో నాటు సారా అమ్ముతున్న మహిళను అరెస్ట్ చేసి, రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నేడు పశు గర్భకోశ వైద్య శిబిరం

మాడుగుల : మండలంలోని జమ్మాదేవిపేటలో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పశు గర్భకోశ వ్యాధులపై వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ప్రాంతీయ పశు వైద్యశాల ఉప సంచాలకులు వి.చిట్టినాయుడు తెలిపారు. ఈ శిబిరంలో కట్టుకురాని పడ్డలు, చూడి పశువులకు తనిఖీలు చేసి, మూడుసార్లు కంటే ఎక్కువ సార్లు కట్టుకురాని పశువులకు చికిత్స తోపాటు, ఉచితంగా మందులు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చిట్టినాయుడు కోరారు.

వీబీ పేటలో 'గడపగడపకు' నేడు

చీడికాడ : మండలంలోని వి.బి.పేట పంచాయతీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు బూడి ముత్యాలనాయుడు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 7–30 గంటలకు వి.బి.పేటలో ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ, పార్టీ నేతలు, కోఆపరేటివ్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

ఆకట్టుకున్న ఎడ్ల బళ్ల పోటీలు



పోటీలో పరుగు తీస్తున్న ఎడ్ల బండి

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాదిలో బుధవారం లక్ష్మీకాంతమ్మ చిట్టెమ్మ పేరంటాల తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల బళ్ల పరుగు పందాలు ఆకట్టుకున్నాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన ఎడ్ల బళ్లను హుషారుగా రంకెలేయిస్తూ రైతులు పరుగులు తీయించడాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఎడ్ల బళ్ల పరుగు పందాలతో పాటు ముగ్గుల పోటీలు, ఉట్టికొట్టే పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులను అందించారు.

ఘనంగా తీర్థ మహోత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు

కె.కోటపాడు : మండలంలోని సింగన్నదొరపాలెం, గొట్లాం, చౌడువాడ గ్రామాల్లో బుధవారం తీర్థమహోత్సవాలు ఘనంగా జరిగాయి. సింగన్నదొరపాలెం మరిడిమాంబ, గొట్లాం చింతాలమ్మ, చౌడువాడ శ్రీకృష్ణుని తీర్థమహోత్సవాలను ఆయా గ్రామ ప్రజలు అత్యంత వేడుకగా నిర్వహించారు. సింగన్నదొరపాలెంలో మరిడిమాంబ అమ్మవారికి గ్రామ వైఎస్సార్‌సీపీ కన్వీనర్, పీఏసీఎస్ డైరెక్టర్ లాలం నాని, ఉపాధ్యక్షుడు రొంగలి రమణ, మాజీ ఎంపీపీ నారపాటి శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు రొంగలి లక్ష్మి ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా అక్కమ్మ పేరంటాల తీర్థం

మాడుగుల రూరల్: కె.జె.పురం శివారు తెలకలదీపం గ్రామములో అక్కమ్మ పేరంటాల తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజలు చేశారు. సర్పంచ్ జామి రమణబాబు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం



చెరకు పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

మాడుగుల రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే నెల 15వ తేదీలోపు ధాన్యం కొనుగోలు చెయ్యాలని సంబంధిత సిబ్బందిని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు సూచించారు. బుధవారం ఆయన మాడుగుల మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో వీఏఏలు, వీహెచ్ఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేడ్ల ఆధారంగా కొనుగోలు ధరపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఏ గ్రేడ్‌కు రూ.2,060, సాధారణ రకానికి రూ.2,040తో కొనుగోలు చేయాలన్నారు. అనంతరం కె.జె.పురంలో బోడ్డేడ ఆనంద్ అనే రైతు పండించిన చెరకు తోటలో చేస్తోన్న పంటకోత ప్రయోగాన్ని పరిశీలించారు. ఈ ప్రయోగం ద్వారా గ్రామంలో చెరకు పంట సరాసరి దిగుబడి ఒక ఎకరానికి 22 టన్నుల వరకు రావచ్చని అంచనా వేశారు. ఈ రబీ సీజన్‌లో రైతులు పండిస్తున్న వరి, అపరాల సాగుకు సంబంధించి ఈ క్రాప్ నమోదును వచ్చే నెల 10లోపు పూర్తి చేయాలని సూచించారు. ఈయన వెంట మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు, సహాయ గణాంక అధికారి చంద్రమౌళి, వ్యవసాయ విస్తరణాధికార్లు డి.సత్యనారాయణ, బి.జగన్నాథరావు, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

జనుము పంటపై రైతుల ఆసక్తి



రోలుగుంటలో కళకళలాడుతున్న జనుము పంట

రోలుగుంట: మండలంలో జనుము పంట సాగుపై రైతులు ఆసక్తి చూపారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మండలంలోని పలు గ్రామాల్లో 920 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో జనుము పంట సాగు చేస్తున్నారు. ఈ పంటకు వర్షంతో పెద్దగా పని లేదు. ఖరీఫ్‌లో సాగయిన వరి పంట పొలాల్లో కోతలకు ఒకట్రెండు రోజులు ముందుగా వీటిని వేస్తారు. ఎకరానికి నాలుగు కేజీల జనుము విత్తనాలు సరిపోతాయి. ఈ పంట మంచు తేమకే బాగా పెరుగుతుంది. కూలీలతో ప్రయాస లేదు. దుక్కులు దున్నే అవసరమూ లేదు. కేవలం మూడు నెలల్లోపే పంట చేతికి వస్తుంది. పంట పండితే దిగుబడి కూడా బాగానే ఉంది. పెట్టుబడి విత్తనాల కొనుగోలుకు కిలోకి రూ.75 చొప్పున నాలుగు కిలోలకు రూ.300 మాత్రమే. పంట సేకరణకు తప్ప, మరే పెట్టుబడి వ్యయం ఉండదు. దిగుబడి ఎకరానికి కనీసం రూ.10 వేలు వరకు ఉంటుందని రైతులు చెప్తున్నారు. దీంతో పెద్దగా ఖర్చులేని వ్యవసాయం కావడంతో రైతులు ఖరీఫ్ సీజన్లో జనుము పంటపై ఆసక్తి చూపుతున్నట్టు వ్యవసాయాధికారులు చెప్తున్నారు.

'పాల'నాదక్షుడు ఆడారి

● ఊరూరా ఆడారి తులసీరావు సంతాప సభలు



తులసీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ శరారినాయుడు, ఎంపీటీసీ శ్రీలక్ష్మి



తులసీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాల సంఘాల అధ్యక్షులు, సిబ్బంది

కె.కోటపాడు/మాడుగుల రూరల్/దేవరాపల్లి : విశాఖ డెయిరీ పాల సంఘాల ద్వారా పాడి రైతుల సంక్షేమానికి డెయిరీ మాజీ చైర్మన్, దివంగత ఆడారి తులసీరావు చేసిన కృషి ఎనలేనిదని పాల సంఘాల అధ్యక్షులు, రైతు సంఘాల ప్రతినిధులు కొనియాడారు. ఆయన మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఊరూరా సంతాప సభలు నిర్వహించి, ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

● చౌడువాడ పాల సంఘం ఆవరణలో సంఘం అధ్యక్షుడు కోమార వెంకటరమణ ఆధ్వర్యంలో సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు మంచి మద్దతు ధరతో పాటు రైతుల పిల్లలకు ఉచితంగా చదువులు, కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యంను అందించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పలు పాల సంఘాల అధ్యక్షులు కోమార ఎర్రునాయుడు, మల్లిరెడ్డి నాగేశ్వరరావుతో పాటు వేతన కార్యదర్శులు చిన్ని వెంకట నర్సింహమూర్తి, లెక్కల ఈశ్వరరావు, జాగరపు అప్పారావు, చోరీగల మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
ల్గోన్నారు.

● మాడుగులలోని కేజే పురం 1వ పాల సొసైటీ వద్ద సొసైటీ అధ్యక్షుడు యల్లపు వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంతాప సభ జరిగింది. తులసీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భీశెట్టి జగ్గప్పారావు, పెంటకోట మాలినాయుడు, డెయిరీ మాజీ డైరెక్టర్ దాడి మల్లునాయుడు, పాల సొసైటీ కార్యదర్శి బోడ్డేడ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని వంటర్లపాలెం, వి.వి.అగ్రహారం, జి.అగ్రహారం, వీరనారాయణం, గాదిరాయి, కింతలి, వల్లాపురం, ఎం.కోటపాడు, చింతలూరు, జాలంపల్లి, ఒమ్మలి, వీజే పురం తదితర గ్రామాల్లో తులసీరావు చిత్రపటానికి అయా గ్రామ పాల సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులు, డైరక్టర్లు నివాళులర్పించారు.

● దేవరాపల్లిలోని వేచలం పాలసొసైటీ వద్ద సంఘం అధ్యక్షుడు వేచలపు కృష్ణ, ఎంపీటీసీ రెడ్డి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో తులసీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయుకులు రెడ్డి బలరాం, వేచలపు చిన్నంనాయుడు, బత్తి నాయుడు, వేచలపు గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ 'ఉపాధి' కల్పిస్తాం

● ఉపాధిలో 450 పనులకు రూ.17 కోట్లు మంజూరు
● ఉపాధి పథకం అనకాపల్లి క్లస్టర్ ఏపీడీ మణికుమార్



సిబ్బందితో మాట్లాడుతున్న మణికుమార్

రావికమతం: ఖాళీగా ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో పని కల్పించే బాధ్యత తమపై ఉందని అనకాపల్లి క్లస్టర్ ఏపీడీ మణికుమార్ అన్నారు. రావికమతం ఉపాధి కార్యాలయంలో మండల స్థాయి సిబ్బంది, క్షేత్ర స్థాయి సిబ్బందికి ఈ ఏడాది జరిగే పనులపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. , మండలానికి 450 పనులకు గానూ రూ.17 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. పండగలు, వ్యవసాయ పనులు పూర్తయినందున ప్రజలు ఖాళీగా ఉంటారని, ఈ ఏడాది నుంచి ఇంటింటికీ వెళ్లి పనులకు ఆహ్వానించాలని సూచించారు. జాబ్‌కార్డు లేని వారికి కార్డు తక్షణం ఇప్పించి పని కల్పించాలన్నారు. మట్టిరోడ్లు, పంట కాలువలు, శ్మశాన వాటికల అభివృద్ధితో పాటు పూడికతీతలు, బౌండరీ ట్రెంచ్‌లు, పండ్ల తోటల పెంపకం వంటి పనులు చేపడితే రైతులకు, గ్రామాలకు ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రూ.257కి తక్కువ కూలీ లేకుండా పని కల్పించాలన్నారు. ఆ విధంగా కూలీ పొందాలంటే ఏ మేరకు పని చేయాలో.. బోర్డుపై గ్రామస్తులకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. ప్రజలు గ్రామాల నుంచి వలస వెళ్లకుండా చూడాలని, తరచుగా దీని పర్యవేక్షణకు గ్రామాల్లో పర్యటించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో కాశి, ఈసీ కామేష్, టెక్నికల్ అసిస్టెంట్ మోహన్, రమణ పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న దళిత నాయకులు

నర్సీపట్నం: మాకవరపాలెంలోని జి.నగరం దళితులపై దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని దళిత సంఘాల నాయకులు సీహెచ్ చలపతిరావు, పావాడ కామరాజు, ఎం.చంటిబాబు, కె.మల్లేష్, వై.పాపారావు డిమాండ్ చేశారు. నగరం ఘటనపై బుధవారం దళిత సంఘాల నాయకులు ఆర్డీవోజయరాంకు ఫిర్యాదు చేశారు. కులం పేరుతో దాడికి పాల్పడిన వారిని వదిలేసి, బాధితులైన దళితులపై మర్డర్ కేసు నమోదు చేసి, అరెస్టు చేయటం అన్యాయమన్నారు. దోషులపై చర్యలు తీసుకోకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు.

మాకవరపాలెం: జి.నగరంలో దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు ఎం.అప్పలరాజు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ దాడి ఘటనలో ఇప్పటికే ఆరుగురు దళితులను అరెస్టు చేశారని, దళితుల ఫిర్యాదుపై మరో వర్గం వారిని అరెస్టు చేయకపోవడం సరికాదన్నారు.

తెలుగువాడి ఆత్మగౌరవం ఎన్టీఆర్

కె.కోటపాడు : తెలుగువాడి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ స్థాయికి తీసుకెళ్లి, కేంద్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్.టి.రామారావు అని తెలుగుదేశం పార్టీ నియోజకర్గ ఇన్‌చార్జ్ పీవీజీ కుమార్ అన్నారు. కె.కోటపాడులో బుధవారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు రొంగలి మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక మూడురోడ్ల కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు పైల ప్రసాదరావు, సర్పంచ్‌లు దాడి ఎరుకునాయుడు, బొడ్డు అక్కునాయుడు, బండారు నరసింహనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా గిడుగు రుద్రరాజు జన్మదిన వేడుకలు

మాడుగుల రూరల్ : పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు జన్మదిన వేడుకలు బుధవారం ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి, పార్టీ అభిమానులకు పంచిపెట్టారు. పీహెచ్‌సీల్లో రొట్టెలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడబండి రాజు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏసురాజు, మండల కార్యదర్శి బొడ్డు నాని, రావాడ అప్పారావు, పిళ్లా అప్పారావు పాల్గొన్నారు.